సాక్షి కుమురం భీం

మంగళవారం । 4 । మార్చి । 2025



వ్యవసాయంలో ఆదర్శం

నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోంద్రట్‌కు చెందిన సాయినాథ్ గోఆధారిత, సేంద్రియ పద్ధతిలో పంట సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:19	బుధ : 5:16

గరిష్ఠం/కనిష్ఠం 37.5 /22.3

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత మరింత పెరుగుతుంది. రాత్రి చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ డీఎంను సస్పెండ్ చేయాలని వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న డిపో మేనేజర్ విశ్వనాథ్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల హేమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, కార్మిక సంఘం నాయకులు కేఎస్‌రావ్ సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే సర్వీసులను నడిపితే మూడు రోజుల పని దినాలుగా ఇస్తుండగా రెండు రోజులకు కుదించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. డ్రంకెన్ డ్రైవ్ పేరుతో పనిచేయని మిషన్‌తో టెస్టులు చేయించి కార్మికులపై తప్పుడు నివేదికలు ఇచ్చి సస్పెండ్ చేయడం, సర్వీస్ నుంచి రిమూవల్ చేయడం వంటి కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఆర్‌ఎంను ట్రాన్స్‌ఫర్ చేసి మేనేజర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కేశవ రెడ్డి, ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



మాట్లాడుతున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ ఉపాధ్యాయుడు బోధనలో మెలకువలు నేర్చుకుని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొత్త టీచర్లకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ సోమవారం ముగిసింది. కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిపుణులు శంకర్, రమేశ్, వెంకటేశ్, చైతన్య, బాలకృష్ణ, గోవింద్ పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత



భీమిని పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

భీమిని: మండలంలోని మల్లిడి ప్రధాన రహదారిపై సోమవారం భీమిని పోలీసులు నిషేధిత పత్తి విత్తనాలను పట్టుకున్నారు. రూ.6.85లక్షల విలువైన 2క్వింటాళ్ల 74కిలోలు విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు మల్లిడి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కుమురంభీం జిల్లా దహెగాం మండలం అత్తిని గ్రామం నుంచి భీమిని మండలం వడాల వైపు ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నారు. వారిని విచారణ చేయగా.. వడాల గ్రామంలోని బంధువులకు అమ్మడానికి 50కిలోల గ్లైసిల్ విత్తనాలు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వారు ఇచ్చిన సమాచారం మేరకు అత్తిని గ్రామంలోని రాజన్న ఇంట్లో 2క్వింటాళ్ల 27 కిలోల విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6.85లక్షలు ఉంటుందని, కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పురుషోత్తం, పోశం, కృష్ణ, దహెగాం మండలం అత్తిని గ్రామానికి చెందిన రాజన్న, గుంటూరుకు చెందిన సురేష్‌లపై కేసు నమోదు చేశామని ఏసీపీ తెలిపారు. నిషేధిత గ్లైసెల్ విత్తనాలు అక్రమంగా చేరవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడిన పత్తి విత్తనాలను మండల వ్యవసాయాధికారులు నిషేధిత పత్తి విత్తనాలుగా ధ్రువీకరించారు. భీమిని పోలీసులను ఏసీపీ అభినందించారు. తాండూర్ సీఐ కుమారస్వామి, భీమిని ఎస్సై విజయ్‌కుమార్, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వీరన్న పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 25న 'నిషేధిత విత్తనంపై జాగ్రత్త' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ముందే అధికారులను అప్రమత్తం చేసింది.

ఊరించి.. ఉసూరుమనిపించి..!

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పదేళ్లలో దేశంలో పలు జాతీయ రహదారుల నిర్మాణాలు చేపట్టింది. అందులో భాగంగా తొమ్మిదేళ్ల క్రితం తెలంగాణలోని భద్రాచలం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కౌటాల వరకు జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత లేక, ఇతర కారణాలతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ జాతీయ హైవేను రద్దు చేసింది. దీంతో జిల్లాతో పాటు రాష్ట్రంలో పర్యాటకానికి నష్టం జరగడంతోపాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం దూరమైంది.

- భద్రాచలం – కౌటాల హైవే క్యాన్సిల్
- తీవ్రవాద ప్రభావిత ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం
- ఇటీవల రద్దు చేస్తూ ఆదేశాలు..
- టూరిజం అభివృద్ధిపై ప్రభావం



హైవే రోడ్డు..

కౌటాల: రహదారులు ప్రగతికి చిహ్నాలు..అందుకే ప్రభుత్వాలు ఏవైనా రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తుంటాయి. చక్కటి రోడ్లతో జిల్లాల మధ్య అనుసంధానం జరిగితే పర్యాటక, వాణిజ్య, వ్యాపార లావాదేవీలు వృద్ధి చెంది, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం వస్తుంది. అలాగే ఈ ప్రాంతాల్లో నాణ్యమైన రవాణా వ్యవస్థ ఏర్పడడంతో పాటు ఆదాయం పెరుగుతుంది. కానీ తాజాగా భారీ జాతీయ రహదారి విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా హైవే రద్దయ్యింది. రాష్ట్రంలోని జిల్లాలను అనుసంధానం చేస్తూ జాతీయ రహదారి ప్రాజెక్ట్ మంజూరై, కన్సల్టెంట్ సర్వే పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్టు పెండింగులో పడింది. రాష్ట్ర ప్రభుత్వ పక్షాన సరైన పర్యవేక్షణ లేకపోవడంతో దానిని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో దాదాపు రూ.8వేల కోట్ల కీలక జాతీయ రహదారి హైవేను కోల్పోయాం.

భద్రాచలం టు కౌటాల...

తెలంగాణలో వామపక్ష తీవ్రవాద ప్రభావం తీవ్రంగా ఉండడంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సరైన రోడ్డు రవాణా వ్యవస్థ ఏర్పడలేదు. ఈ నేపథ్యంలో 2016లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పటి రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు భద్రాచలం నుంచి గోదావరి పరీవాహక ప్రాంతాన్ని అనుసంధానిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కౌటాల మండలం వరకు నాలుగు వరుసల రోడ్డును ప్రతిపాదించారు. గోదావరి మీదుగా వంతెన నిర్మాణంతో ఈ రోడ్డును ఛత్తీస్‌గఢ్‌కు కూడా అనుసంధానించే అవకాశం ఉండడంతో కేంద్రం వెంటనే దీనికి సమ్మతించింది. దాదాపు 400 కిలోమీటర్ల నిడివితో దీనిని జాతీయ రహదారిగా చేపట్టేందుకు అంగీకరించి మంజూరు చేసింది. ఈ మేరకు కన్సల్టెన్సీ సంస్థను కూడా నియమించి సర్వే చేయించింది. కానీ కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాల్లో సఖ్యత సన్నగిల్లింది. దీంతో కొన్ని జాతీయ రహదారి ప్రాజెక్టుల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ పక్షాన క్రమం తప్పకుండా పర్యవేక్షించే చొరవ కూడా మందగించింది. దీంతో కొంతకాలం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టింది.

ఆగిన హైవే..

రాష్ట్రంలోని గోదావరి పరీవాహక జాతీయ రహదారి ప్రాజెక్టు పేరిట భద్రాచలం–సారపాక–ఏటూరు నాగారం–కాళేశ్వరం–చెన్నూర్–కౌటాల మీదుగా ఈ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలను అనుసంధానిస్తూ సాగాల్సి ఉంది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు లేకపోవడంతో భద్రచాలం–కౌటాల రోడ్డు నిర్మాణంపై తీవ్ర ప్రభావం చూపిందన్న విమర్శలున్నాయి. అయితే చాలా ప్రాంతాల్లో అటవీ ప్రాంతం మీదుగా రోడ్డు నిర్మించాల్సి రావడంతో అటవీ భూముల సేకరణ ఇబ్బందిగా మారుతుందని, వన్యప్రాణులకు సమస్యలేర్పడుతాయన్న భావన వ్యక్తమైంది. ఎన్నికలకు ముందు కొన్ని పెండింగ్ ప్రాజెక్టులను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం వాటిల్లో కొన్నింటిని రద్దు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా భద్రాచలం నుంచి కౌటాల వరకు హైవే జాతీయ రహదారిని ఇటీవల రద్దు చేసింది. ఈ హైవే నిర్మాణంతో ఆయా ప్రాంతాలు అన్ని రంగాల్లో వృద్ధి చెందుతాయని భావించిన ప్రజలకు నిరాశ తప్పలేదు. మరో వైపు కేంద్రం ఈ హైవేను రద్దు చేయడంతో ఆయా ప్రాంతాల్లోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఎలాంటి సమాధానాలు చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొంది.

పర్యాటకానికి ఆటంకం..

హైవే రోడ్డుతో ఆయా ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందుతాయి. రోడ్డు సౌకర్యాలు మెరుగుపడడం వల్ల పర్యాటకులు సులువుగా ప్రయాణించగలుగుతారు. అలాగే ప్రధాన రహదారుల వెంబడి ఆర్థిక కారిడార్లు, పారిశ్రామిక సమూహాలు ఏర్పడతాయి. భద్రాచలం నుంచి కౌటాల వరకు హైవే నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో పలు విద్యుదుత్పత్తి, సాగునీటి ప్రాజెక్టులను కూడా ఇది జోడిస్తుండేది. గోదావరి తీరంలో ఎన్నో ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటకులను బాగా ఆకట్టుకునే ప్రాంతాలున్నాయి. వాటన్నింటిని కలుపుతూ ఈ హైవే కొనసాగడం వల్ల ఆయా ప్రాంతాల్లో పర్యాటకరంగం ఎంతో అభివృద్ధి చెందేది. కానీ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అటవీ భూముల సమస్యకు సరైన ప్రత్యామ్నాయం చూపుతూ ఢిల్లీ స్థాయిలో ఫాలోఅప్ చేయకపోవడంతో కేంద్రం ఈ రోడ్డును రద్దు చేసినట్లు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి, పర్యాటకానికి, మెరుగైన రవాణా సౌకర్యం చేజారినట్టయింది. దీంతో ప్రభుత్వాల తీరుపై ఆయా ప్రాంతాల ప్రజలు నిరాశ చెందుతున్నారు.

హైవే రద్దుతో నష్టం



మా ప్రాంతంలో సరైన రోడ్డు సౌకర్యంలేక అనేక ఏళ్లుగా తిప్పలు పడుతున్నాం. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల క్రితం భద్రాచలం నుంచి కౌటాల వరకు హైవే నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. కానీ అనివార్య కారణాలతో ఇటీవల రద్దు చేయడంతో ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ హైవే రద్దుపై పునరాలోచన చేయాలి.

– మోర్లె పాండురంగ్, కన్నెపల్లి, కౌటాల

నిరాశపడుతున్నాం..



భద్రాచలం నుంచి కౌటాల వరకు పెద్ద రోడ్డు వేస్తారని గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పడంతో చాలా సంతోషించాం. పర్యాటకంగా అభివృద్ధి జరుగుతుందని ఆశించాం. ఈ రోడ్డు నిర్మిస్తే మారుమూల ప్రాంతాల నుంచి పెద్దపెద్ద పట్టణాలకు సులువుగా వెళ్లేవాళ్లం. కానీ ప్రభుత్వం ఈ రోడ్డును రద్దు చేసిందని తెలిసి నిరాశ పడుతున్నాం.

– సిడాం దౌలత్, వీర్దండి, కౌటాల

యాసంగి పంటలకు సాగునీరు అందించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్ (రెవెన్యూ)

ఆసిఫాబాద్‌అర్బన్: యాసంగిలో ప్రాజెక్టులు, చెరువుల కిందసాగు చేసే పంటలకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సాగునీటి, వ్యవసాయ, విద్యుత్‌శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఒక ఎకరం కూడా ఎండిపోవద్దని, వచ్చే 15 రోజులు చాలా కీలకమైన సమయమన్నారు. ప్రాజక్టుల నీటితో చెరువులను నింపాలని, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా పర్యవేక్షించాలన్నారు. సాగునీటిని చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్, నీటిపారుదల శాఖ ఏఈ, మండల వ్యవసాయ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసుకుని తాగునీరు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని ప్రతీ గురుకులాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న నూతన మెనూ అమలుపై తనిఖీ నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, డీఏవో శ్రీనివాసరావ్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషారావ్, నీటిపారుదల శాఖ ఈఈలు ప్రభాకర్, గుణవంత్ రావ్, డీఆర్‌డీఏ దత్తారాం పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

రెబ్బెన: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి ఏరియాలోని మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఈ నెల 5న గోలేటి టౌన్‌షిప్‌లోని జీటీసీవోఏ క్లబ్‌లో, 6న మాదారం టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్‌లో, 7న గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కొలువులు..!

- ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు..
- మార్చి 8న మహిళా దినోత్సవం రోజున నోటిఫికేషన్?
- టీచర్‌లు 126, ఆయాలు 397, సూపర్‌వైజర్‌లు 20, సీడీపీవో 2 ఖాళీలు



బెజ్జూర్ మండల కేంద్రంలో టీచర్‌లేని అంగన్‌వాడీ కేంద్రం

దహెగాం: గ్రామాల్లో ఆటాపాటలతో చిన్నారులను పాఠశాలకు అలవాటు చేయడం, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడానికి ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉండడంతో సరైన పోషకాహారం అందడంలేదు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సరిగా లేకపోవడం, వెక్కిరిస్తున్న ఖాళీలపై పత్రికల్లో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆయా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులను భర్తీ చేయడానికి మార్చి 8న మహిళా దినోత్సవం రోజున నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు. దీంతో ఆయా పోస్టులకు మోక్షం కలుగనుంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మెరుగుపడనుంది.

జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో ఐసీడీఎస్ కింద 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 40,812 మంది చిన్నారులు, 4,668 మంది గర్భిణులు, 3,502 మంది బాలింతలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుంటారు. కానీ ఆయా కేంద్రాల్లో ఏళ్లతరబడిగా ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయక పోవడంతో కొన్ని చోట్ల కేంద్రాలు తెరుచుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 126, ఆయా పోస్టులు 397 ఖాళీలు ఉండడంతో పౌష్టికాహారం అందని ద్రాక్షగానే మిగిలింది. 126 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల్లో ఏజెన్సీలో 81, నాన్ ఏజెన్సీలో 45 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టుల్లో ఏజెన్సీలో 230, నాన్ ఏజెన్సీలో 167 ఖాళీలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించే అధికారుల పోస్టులు సైతం భారీగానే ఖాళీ ఉన్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. అంతేకాకుండా ఆసిఫాబాద్, వాంకిడి ప్రాజెక్టుల్లో రెండు సీడీపీవో పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. ప్రతీ క్లస్టర్‌లో ఒక సూపర్ వైజర్ ఉండాలని నిబంధన ఉంది. కానీ జిల్లా వ్యాప్తంగా 40 సూపర్ వైజర్ పోస్టులకుగానూ 20 మంది మాత్రమే ఉన్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించే వారు కరువయ్యారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి సీతక్క ప్రకటించడంతో ఖాళీలకు మోక్షం కలగనుంది. ఖాళీలను స్థానికులతో భర్తీ చేయాలని డిమాండ్ ఉంది.

జిల్లాలో క్లస్టర్ వారీగా ఖాళీల వివరాలు

క్లస్టర్	అంగన్‌వాడీ టీచర్లు	ఆయాలు
సిర్పూర్(టి)	9	52
జైనూర్	38	117
ఆసిఫాబాద్	30	112
కాగజ్‌నగర్	9	45
వాంకిడి	40	71
మొత్తం	126	397


ప్రభుత్వానికి నివేదించాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయా పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. కార్యకర్తల పోస్టులు 126, ఆయా పోస్టులు 397, సూపర్‌వైజర్ పోస్టులు 20, సీడీపీవో పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయి.

– భాస్కర్, ఐసీడీఎస్ పీడీ

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

లింగాపూర్: జీవో 317 రద్దు చేయాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ వేమనపల్లి మండలం కల్మలపేట ప్రాథమిక పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంతోష్ 317 జీవో కారణంగా బదిలీపై వచ్చాడని, అప్పటినుంచి ఒత్తిడికి లోనవుతున్నాడన్నారు. దీంతో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఉపాధ్యాయులు రాథోడ్ అరుణ, గోవర్ధన్, సాగర్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

'టీచర్'లో కమలం పాగా

- తొలి ప్రాధాన్యత ఓట్లతోనే గెలిచిన మల్క కొమురయ్య
- కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఓట్ల వడబోత
- నేటి మధ్యాహ్నానికి మొదలవనున్న లెక్కింపు
- మందకొడి లెక్కింపుపై అభ్యర్థుల మండిపాటు
- మల్క కొమురయ్యను అభినందించిన బండి సంజయ్
- ఈ తీర్పు టీచర్లకు, మోదీకి అంకితమన్న కేంద్ర సహాయ మంత్రి



ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన మల్క కొమురయ్యకు స్వీటు తినిపిస్తున్న బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ ఉపాధ్యాయుల నియోజకవర్గం కమలం వశమైంది. ముందు నుంచీ అనుకున్నట్లుగా మల్క కొమురయ్య ఆ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. తొలిప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందడం విశేషం. ఓట్ల లెక్కింపు సోమవారం సాయంత్రానికి ప్రారంభం కాగా.. రెండు గంటల్లోనే ఫలితం తేలడం గమనార్హం. టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 27,088 ఓట్లకు గాను 25,041 ఓట్లు పోల్ అవగా.. అందులో 24,144 చెల్లుబాటు అయ్యాయి. కాగా 897 చెల్లలేదు. దీంతో గెలుపు కోటా ఓట్లు 12,073గా నిర్ధారించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు 12,959, వంగ మహేందర్‌రెడ్డికి 7,182, అశోక్‌కుమార్‌కు 2,621, కూర రఘోత్తంరెడ్డికి 428 ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాను బీజేపీ అభ్యర్థి కొమురయ్య చేరుకున్నారు. దీంతో తొలిరౌండ్‌లోనే బీజేపీ మొదటి ప్రాధాన్యం ఓట్లతో గెలిచినట్లయింది. గతంలో పీఆర్‌టీయూ బలపరిచిన కూర రఘోత్తంరెడ్డి విజయం సాధించగా, ఈసారి టీచర్ సంఘాలు కాకుండా జాతీయ పార్టీ బీజేపీ పోటీ చేసి గెలవడం చర్చనీయాంశంగా మారింది.

'బండి' అభినందనలు

రాత్రి 10.20 గంటల సమయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కౌంటింగ్ సెంటర్ వద్దకు వచ్చి మల్క కొమురయ్యను అభినందించారు. ఇది చారిత్రక విజయమని, ఈ తీర్పు టీచర్లకు, మోదీకి అంకితమని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ప్రజలు చెంపపెట్టులాంటి తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్క కొమురయ్య, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'చారిత్రాత్మక తీర్పునిచ్చిన ఉపాధ్యాయులందరికీ వందనాలు. ఇది మామూలు విజయం కాదు. 5,900 ఓట్ల తేడాతో మల్క కొమురయ్య భారీ విజయం సాధించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల నమ్మకం, భరోసా ఉంది. దేశ వ్యాప్తంగా మేధావి వర్గమంతా మోదీపై నమ్మకంతో ఉన్నారు..' అని అన్నారు.

కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ వడబోత..


సోమవారం ఉదయం నుంచి గ్రాడ్యుయేట్ ఓట్ల వడపోత కొనసాగుతూనే ఉంది. ఉదయం 8 గంటలకు మొదలు పెట్టిన ఓట్ల లెక్కింపు, చెల్లని, చెల్లిన ఓటర్ల విభజనపై రాత్రి 9గంటలు దాటేవరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో రకరకాల ప్రచారాలు మొదలవడంతో రాత్రి ప్రకటించారు. అప్పటి వరకూ దాదాపు లక్ష ఓట్లను వడబోయగా 92,000 చెల్లుబాటు అయ్యాయని, 8,000 ఓట్లు చెల్లలేదని, మిగిలిన 1.50 లక్షల ఓట్ల వడబోత మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం లెక్కింపు మొదలైనా.. తొలి ప్రాధాన్యతలో కోటా ఓట్లు రాకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ మొదలవుతుందని వివరించారు. అందులో కోటా ఓట్లు చేరుకునే వరకు ఎలిమినేషన్ రౌండ్లు కొనసాగుతాయి.

ఆర్వో, సిబ్బందిపై మండిపాటు

గ్రాడ్యుయేట్, టీచర్లకు పోటీ పడిన పలు పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో), లెక్కింపు సిబ్బందిపై మండిపడ్డారు. లెక్కింపు ప్రక్రియ మందకొడిగా సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రానికి నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఫలితం కొలిక్కి వచ్చినా.. కరీంనగర్ కౌంటింగ్ కేంద్రం నుంచి టీచర్, గ్రాడ్యుయేట్ స్థానాలకు సంబంధించి ఎలాంటి సమాచారం రాకపోవడంపై మండిపడ్డారు. పోలైన ఓట్లలో కొందరు 01, 02 అని వేసిన వారి ఓట్లు పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. టీచర్స్ ఎమ్మెల్సీకి పోలైన ఓట్ల విషయంలోనూ గందరగోళం నెలకొందని ఆరోపణలు వస్తున్నాయి. పోలింగ్‌రోజు రాత్రి 24,895 ఓట్లు వచ్చాయని, శుక్రవారం 24,968 మంది ఓటేశారని, సోమవారం మొత్తంగా 25,041 ఓట్లు పోలయ్యాయని వెల్లడించడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు.

ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యం

- ఆలిండియా భిక్కు సంఘం ప్రధాన కార్యదర్శి భంతే భదంత్ ధమ్మ సారథి



మాట్లాడుతున్న భంతే భదంత్ ధమ్మ సారథి

వాంకిడి: ప్రపంచ శాంతికి గౌతమ బుద్ధుడు చూపించిన బౌద్ధ మార్గమే శరణ్యమని ఆలిండియా భిక్కు సంఘం ప్రధాన కార్యదర్శి భంతే భదంత్ ధమ్మ సారథి అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ధమ్మ దీక్ష శ్రామ్‌నేర్ శిబిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బౌద్ధ గురువులు భంతే వివేక్, రాహుల్ బోధి, నిబ్బాన్‌లతో కలిసి బౌద్ధ సూత్రోచ్ఛరణలు ప్రబోధించి దీక్ష స్వీకరించేందుకు ముందుకొచ్చిన 30 మందికి కాషాయ దుస్తులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బౌద్ధం అనేది మతం కాదని, ప్రపంచ శాంతికి మార్గం అన్నారు. ప్రజ్ఞా, శీలం, కరుణ అనే అంశాలపైనే మనిషి జీవన శైలి ఆధారపడి ఉంటుందన్నారు. 1956 ఏప్రిల్ 14న అంబేడ్కర్ లక్ష మందితో కలిసి నాగ్‌పూర్ పట్టణంలో బౌద్ధాన్ని స్వీకరించారని, శాంతిని బోధిస్తూ, అస్పృశ్యతకు అవకాశం లేకుండా సమ సమాజ నిర్మాణానికి, మూఢ నమ్మకాలను విడనాడేందుకు బౌద్ధం ఒక సూచికలా ఉపయోగపడుతుందన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ బౌద్ధాన్ని ఆచరించాల్సిన అవసరం నేటి ప్రపంచానికి ఎంతైనా ఉందన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఉపాధ్యక్షుడు వినేష్ ఉప్రే, మండల అధ్యక్షుడు జైరాం ఉప్రే, అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, నాయకులు విలాస్ ఖోబ్రగడె, రాజేంద్ర ప్రసాద్, హంసరాజ్, రోషన్, విఠల్, విజయ్ ఉప్రే, నాగ్‌సేన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


లలిత (ఫైల్)

పెంచికల్‌పేట్‌:మండలంలోని లోడుపల్లి శివారు పంట చేనులో వివాహిత అనుమానస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. ఎస్సై కొముర య్య, కుటుంబీకులు తెలిపిన వివరాలు..లోడుపల్లి గ్రామానికి చెందిన గుర్లె గణేశ్‌కు రుద్రపూర్‌కు చెందిన లలిత(34)తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. లలిత కుమారుడు రవీందర్‌తో కలిసి రాంనగర్‌ కాలనీలోని కొత్త ఇంట్లో ఆదివారం రాత్రి నిద్రించింది. సోమవారం ఉదయం చేనుకు వెళ్లిన అత్త కమల.. విగత జీవిగా పడి ఉన్న కోడలు లలితను చూసి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించింది. కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై కొమురయ్య ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్‌ స్క్వాడ్‌, క్లూస్‌టీంతో కలిసి ఇంటి వద్ద, చేనులో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, తన కుమార్తె లలితను అల్లుడు గణేశ్‌ హత్య చేసినట్లు మృతురాలి తల్లి సొనాలే తానుబాయి ఆరోపించింది. నిందితుడిని శిక్షించాలని డిమాండ్‌ చేసింది. ఆమె ఫిర్యాదుతో హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విచారణ అనంతరం మృతికి గల పూర్తి కారణాలు వెల్లడిస్తామన్నారు.

కెనాల్‌లో పడి వ్యక్తి..


దహెగాం: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు ప్రాణహిత కెనాల్‌లో పడి మృతిచెందాడు. ఏఎస్సై ప్రకాశ్‌ కథనం ప్రకారం.. మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన తుమ్మిడె చంద్రు (45) ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లలో, పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆయనకు ఫోన్‌ చేస్తే లిఫ్ట్‌ చేయడం లేదు. పీపీరావు కాలనీ, కుంచవెల్లి మధ్యలో ఉన్న ప్రాణహిత కెనాల్‌ ఒడ్డున, పాదరక్షలు, సెల్‌ఫోన్‌, టవల్‌ ఉన్నట్లు గుర్తించారు. దీంతో కెనాల్‌లో వెతకగా మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతురాలి భార్య వీణక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

స్కూటీ అదుపుతప్పి యువకుడు..


అంజన్న (ఫైల్)

కాసిపేట: స్కూటీ అదుపుతప్పి యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దుబ్బగూడెంకు చెందిన దుర్గం అంజన్న (20) పని నిమిత్తం మందమర్రికి వెళ్లి తిరిగి స్కూటీపై వస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున చొప్పరిపల్లి సమీపంలో అతి వేగంగా వచ్చి జాతీయ రహదారి సర్వీసు రోడ్డు రేలింగ్‌కు ఢీకొట్టాడు. ఆయన తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘తప్ప’టడుగులు..!



- సారంగాపూర్‌ మండలంలోని ఓ గ్రామంలో 18 ఏళ్లలోపు బాలలు బృందాలుగా అంతర్గతంగా జరిగిన గొడవల్లో వేరుపడి వ్యక్తిగత కక్షలతో ఒకరినొకరు పగ పెంచుకున్నారు. ఒకానొక సమయంలో కత్తిపోట్ల కలకలం చెలరేగింది. తెలిసీ తెలియని వయసులో పోలీసు కేసులు, శారీరక గాయాలు వంటి నష్టం జరిగిపోయింది.
- నిర్మల్‌లో ఇంటర్‌ చదివే ఓ యువకుడు ప్రతీరోజు సాయంత్రం కాగానే ఇంటి నుంచి ఫ్రెండ్స్‌ను కలిసేవాడు. రాత్రి 10 గంటల తర్వాత ఇంటికి చేరుకునేవాడు. ఎక్కడికి వెళ్తున్నాడని తల్లిదండ్రులు ఆరా తీశారు. జాతీయ రహదారి బైపాస్‌ రోడ్డు వెంబడి మిత్రులతో కలిసి వెళ్లి గంజాయికి అలవాటు పడినట్లు గ్రహించారు.
- జిల్లాకేంద్రంలో కొన్ని నెలలక్రితం ఇంట్లో చదువుకుంటున్న యువకుడిని తమతో రమ్మని కలిసి వెళ్లిన ముగ్గురు మిత్రులు జాతీయ రహదారిపై బైక్‌లతో రైడింగ్‌ చేశారు. ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఇద్దరు యువకులకు కాళ్లు, చేతులు విరిగి మంచానపడ్డారు.
- ప్రస్తుతం టీనేజ్‌ వయసు పిల్లల దురలవాట్లకు లోనవుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. దీనికి కారణాలేవైనా వారిపట్ల ప్రత్యేక పర్యవేక్షణతోనే సరైన మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తేనే ఫలితముంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



నిర్మల్‌ఖిల్లా: విద్యార్థుల టీనేజ్‌ దశ తల్లిదండ్రులకు పరీక్షకాలంగా మారింది. ప్రస్తుతం యువత ఆధునిక పోకడలను అవలంబిస్తుంది. టెన్త్‌, ఇంటర్‌, డిగ్రీ విద్యార్థులు ఈ కల్చర్‌కు అలవాటు పడుతున్నారు. జల్సాల కోసం దేనికైనా వెనుకాడటం లేదు. చెడుస్నేహాలు వీరిని పక్కదారి పట్టిస్తున్నాయి. చిన్న చిన్న విషయాలకే వివాదాలకు దిగడం, తోటి వారిని గాయపర్చడం, నేరపూరిత స్వభావం అలవాటు చేసుకోవడం, గ్యాంగ్‌లుగా ఏర్పడి ఇతరులను బెదిరించడం, దురలవాట్లకు లోను కావడం వంటివి తరచూ జరుగుతున్నాయి. తమ ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోయిన ఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి.

వృత్తిపరమైన ఒత్తిళ్లతో అశ్రద్ధ

తల్లిదండ్రులు వృత్తిపరమైన ఉద్యోగ, ఉపాధి సంబంధిత ఒత్తిళ్లతో పిల్లలతో ఎక్కువ సమయం గడపలేకపోతున్నారు. దీంతో వారు తమ మిత్రుల్లోని చెడు అలవాట్లకు బానిసైన వారిని ఆశ్రయిస్తున్నారు. ఆలోచన ధోరణిలో మార్పులు వస్తున్నాయి. సరైన సమయంలో కుటుంబ పెద్దలు గుర్తించకపోవడంతో గంజాయి, డ్రగ్స్‌ ఆల్కహాల్‌కు బానిసవుతున్నారు. యువత మంచి భవిష్యత్తును కోల్పోతున్నారు. తల్లిదండ్రులు ముందుగా గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

ఏం చేస్తున్నారో..పరిశీలించాలి

పిల్లలు పాఠశాలలకు వెళ్లి వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారు.. తన మిత్రులు ఎలాంటివారు, సహవాస బంధాలు ఎలా ఉన్నాయి? వంటివి తల్లిదండ్రులు పరిశీలించాలి. చెడు వ్యసనాలపై పయనించకుండా శ్రద్ధ వహించాలి. టీనేజ్‌ యువత మంచి మిత్రులతో స్నేహం చేయాలి. పిల్లల ప్రవర్తనలో తేడా కనిపిస్తే కౌన్సెలింగ్‌ నిర్వహించాలి. చదువు, సత్ప్రవర్తన కలిగిన మంచి స్నేహితులను పెంపొందించుకోవడం ద్వారా దారి తప్పకుండా కాపాడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి



టీనేజ్‌ వయసు పిల్లల పట్ల తల్లిదండ్రులు పర్యవేక్షణ చేస్తూ ఉండాలి. మితిమీరిన క్రమశిక్షణ కూడా మంచిది కాదు తగిన స్వేచ్ఛనిస్తూనే దురలవాట్లకు దూరంగా ఉండేటట్లు చూడాలి.అవసరమైతే ఆయా అంశాలపట్ల కౌన్సిలింగ్‌ ఇప్పించాలి.

– డాక్టర్‌ అల్లాడి సురేశ్‌, మానసికవైద్య నిపుణులు, నిర్మల్‌

నైతిక విలువలు నేర్పాలి



చిన్నప్పటి నుంచి పిల్లలకు నైతిక విలువలపై అభిరుచిని ఏర్పర్చాలి. పెద్దలను గౌరవించడం, మంచి అలవాట్లను పెంపొందించుకోవడం నేర్పాలి. ఇంటర్నెట్‌కు దూరంగా ఉంచాలి. మద్యం, గంజాయి, సిగరెట్లు మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే నష్టాలను అవగాహన కల్పించాలి. – జిలకరి రాజేశ్వర్‌, తపస్‌ గౌరవ అధ్యక్షుడు, నిర్మల్‌

మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న మద్యం పట్టివేత


పట్టుకున్న ఎక్సైజ్‌ అధికారులు

ఇచ్చోడ/బోథ్‌: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఇచ్చోడ ఎక్సైజ్‌ సీఐ జుల్ఫీకర్‌ అహ్మద్‌ తెలిపారు. ఇచ్చోడ సీఐ కార్యాలయంలో సోమవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. సొనాల మండలంలోని ఘన్‌పూర్‌ చెక్‌పోస్టు వద్ద సిబ్బంది ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. బజార్‌హత్నూర్‌ మండలం దెగామ గ్రామానికి చెందిన చెవ్వ శ్రీనివాస్‌ బైక్‌పై వస్తున్నాడు. తనిఖీ చేయగా రూ.8,400 విలువ గల మద్యం లభ్యమైంది. వాటిని స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి ఎవరైన మద్యం తీసుకువచ్చి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్‌ సీఐ హెచ్చరించారు.

బైక్‌ చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన సాయిప్రసాద్‌ ద్విచక్రవాహ నం చోరీకి గురైంది. ఆదివారం రాత్రి ఇంటి ఎదుట పార్కింగ్‌ చేశాడు. సోమవారం ఉద యం చూసేసరికి కనిపించలేదు. దీంతో చు ట్టుపక్కల గాలించిన ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సీఐ సునీల్‌ కుమార్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య


వేదిక (ఫైల్)

గుడిహత్నూర్‌: కడుపునొప్పి భరించలేక బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కె.మహేందర్‌, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..మండలంలోని సూర్యగూడ గ్రామానికి చెందిన బాలిక గెడం వేదిక (15) కొన్నినెలలుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు వివిధ ఆసుపత్రుల్లో చూయించినా తగ్గలేదు. సోమవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆదిలాబాద్‌ రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తండ్రి సునీల్‌ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

కడెం: మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఆదిలాబాద్‌ మండలం తిప్ప గ్రామానికి చెందిన ఆత్రం నైకు(24) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మద్యానికి కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో బైక్‌పై బయల్దేరాడు. సోమవారం కడెం మండలం ఉడుంపూర్‌ శివారు అటవీ ప్రాంతానికి చేరుకుని అక్కడ చెట్టుకు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఆత్రం రాము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బేలలో యువకుడు

బేల: మండలంలోని సదల్‌పూర్‌ రెవెన్యూ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దివ్యభారతి కథనం ప్రకారం..మండలంలోని షంషాబాద్‌కు చెందిన బెదుర్‌కార్‌ సుధీర్‌ (28)కి ఇటీవల పెళ్లి కుదిరింది. పెళ్లి ముహూర్తం తీసే క్రమంలో ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఆందోళన చెందాడు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి మహాదేవ్‌ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘మనస్తాపంతోనే ఉపాధ్యాయుడి ఆత్మహత్య’

చెన్నూర్‌: వేమనపల్లి మండలం కల్లంపేట ప్రాథమికోన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు తాప్రె సంతోష్‌(40) మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ మేరకు అతడి భార్య మాలతి ఫిర్యాదు చేశారని సీఐ రవీందర్‌ తెలిపారు. ఆదిలాబాద్‌ పట్టణానికి చెందిన సంతోష్‌ చెన్నూర్‌ పట్టణంలోని ఆదర్శనగర్‌ కాలనీలో అద్దెకు ఉంటున్నాడని, పన్నెండేళ్ల క్రితం చెన్నూర్‌ ప్రాంతానికి ఉపాధ్యాయుడిగా వచ్చి విధుల్లో చేరారని తెలిపారు. స్వగ్రామానికి వెళ్లేందుకు వీలు కావడం లేదని మనస్తాపం చెందేవారని, మ్యూచువల్‌ బదిలీకి సైతం వీలు కాకపోవడంతో మనస్తాపం చెంది ఉరేసుకున్నాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కన్నీరు మున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు

సంతోష్‌ మృతి విషయం తెలుసుకొని వచ్చిన భార్య మాలతితోపాటు పిల్లలు, కుటుంబ సభ్యులు సూసైడ్‌ నోట్‌ చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం ఆదిలాబాద్‌కు తరలించారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

లోకేశ్వరం: పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రాజూర లో ముకేశ్‌ ఆదివారం రాత్రి మద్యం తాగి గొడవ చేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన భోజన్న 100 డయల్‌కు ఫోన్‌ చేసి చెప్పాడు. కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్‌, నీలేశ్‌లు అక్కడికి చేరుకుని ముకేశ్‌ను సముదాయిస్తుండగా అతని చిన్నాన్న కుమారుడు నమోళ్ల ఎల్లప్ప పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్‌ నీలేశ్‌ ఫిర్యాదుతో ఎల్లప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్లేడ్‌తో గొంతుపై దాడి

కెరమెరి: సమాచారం ఇవ్వకపోవడంతో ఒకరి గొంతుపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపర్చిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై గుంపుల విజయ్‌ కథనం ప్రకారం.. హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మడావి గన్ను కెరమెరి బస్టాండ్‌ వద్ద బస్సు కోసం వేచి చూస్తున్నాడు. కెరమెరికి చెందిన దినేశ్‌ మద్యం మత్తులో ఆస్పత్రికి దారి ఏది అని గన్నును అడిగాడు. తనకు తెలియదనగా, నీకెందుకు తెలియదంటూ మాటామాటా పెరిగింది. కోపాద్రిక్తుడైన దినేశ్‌ తన వద్ద ఉన్న బ్లేడ్‌తో గన్ను గొంతుపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్‌ పోలీసుల ప్రతిభ

- అభినందించిన ఎస్పీ గౌస్‌ ఆలం

ఆదిలాబాద్‌టౌన్‌: కరీంనగర్‌లో రెండునెలల పాటు నిర్వహించిన మూడో రాష్ట్రస్థాయి పోలీసు క్రీడల్లో ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన పోలీస్‌ క్రీడాకారులు సత్తాచాటారు. 8 రంగాల్లో ఏడుగురు 10 పతకాలు సాధించారు. జైనథ్‌ పోలీసుస్టేషన్‌ ఉమెన్‌ కానిస్టేబల్‌ ఏ.రూప యోగాలో బంగారు పతకం సాధించగా క్యూఆర్‌టీకి చెందిన పి.మీర్‌ సింగ్‌ రెజ్లింగ్‌లో (కాంస్యం), వెయిట్‌ లిఫ్టింగ్‌లో (రజతం), ఏఆర్‌ హెడ్‌ క్వార్టర్స్‌ కానిస్టేబుల్‌ కె.ముఖేష్‌ కుమార్‌ కరాటే, కుమటోలో (2 రజతం), ఏఆర్‌ హెడ్‌క్వార్టర్స్‌ ఏ.రుచిత జావలిన్‌ త్రోలో (రజతం), క్యూఆర్టీ ఆదిలాబాద్‌ కానిస్టేబుల్‌ వెయిట్‌ లిఫ్టింగ్‌లో ఎండీ నస్మోద్దీన్‌ (రజతం), పి.పూజ 100 మీటర్ల రిలే, 200 మీటర్ల పరుగులో రెండు (రజతం), ఏం.రోహిణి 100 రిలేలో (రజతం) సాధించారు. సోమవారం జిల్లా పోలీస్‌ ముఖ్య కార్యాలయంలో ఎస్పీ గౌస్‌ ఆలం సదరు క్రీడాకారులను అభినందించారు. వారు సాధించిన పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, ఎన్‌.చంద్రశేఖర్‌, సీసీ దుర్గం శ్రీనివాస్‌, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్‌ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.


పతకాలు సాధించిన పోలీసులతో ఆదిలాబాద్‌ ఎస్పీ గౌస్‌ ఆలం

వ్యవసాయంలో ఆదర్శం..

- గోఆధారిత, సేంద్రియ పద్ధతిలో సాగు
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకున్న యువరైతు సిందే సాయినాథ్‌


రైతులకు అవగాహన కల్పిస్తున్న సాయినాథ్‌



మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న సాయినాథ్‌

తానూరు: నిర్మల్‌ జిల్లా తానూరు మండలంలోని బోంద్రట్‌ గ్రామానికి చెందిన కదం సాయినాథ్‌ బీఎస్సీ, ఎంఏ, బీఈడీ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం ఆశించకుండా తరాలుగా వస్తున్న వ్యవసాయాన్ని నమ్ముకున్నాడు. తనకున్న 20 ఎకరాల్లో గోఆధారిత, సేంద్రియ పద్ధతిలో కాలానికి అనుగుణంగా వివిధ రకాల పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. 2024 మార్చి 16న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఉత్తమ రైతు పురస్కారం అందుకున్నాడు.

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

ఈ ఏడాది 6 ఎకరాల్లో పసుపు, 4 ఎకరాల్లో గోధుమ, 2 ఎకరాల్లో పెద్దజొన్న, 5 ఎకరాల్లో మినుము, కందులు, ఎకరంలో నువ్వు, ఒకటిన్నర ఎకరంలో పత్తి సాగు చేశాడు. పసుపు పంటకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయని, పెట్టుబడులు పోనూ రూ.9 లక్షల వరకు మిగులుతాయన్నారు. గోధుమ పంటకు రూ.50 వేల ఖర్చుపోనూ రూ.1.30 లక్షలు, జొన్నపంటకు రూ.5 వేలు ఖర్చులు పోనూ రూ.70 వేలు, మినుము, కంది పంటకు రూ.40 వేల ఖర్చులు పోనూ రూ.2.25 లక్షలు, నువ్వుపంటకు రూ.15 వేల ఖర్చులు పోనూ రూ.40 వేలు, పత్తిసాగుకు రూ.40 వేలు ఖర్చులు పోనూ రూ.80 వేలు మిగిలినట్లు రైతు తెలిపాడు. తొమ్మిదేళ్లుగా 20 ఆవులు, రెండు ఎడ్ల పేడతో వర్మికంపోస్టు, గోఆధారిత, సేంద్రియ సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నట్లు పేర్కొన్నాడు.

అరెకరంలో మల్టీలేయర్‌ ఫామ్‌

రైతు సాయినాథ్‌ అరెకరంలో డాక్టర్‌ సుభాష్‌పాలేకర్‌ ఐదు అంచుల పద్ధతిని ఉపయోగించి మల్టీలేయర్‌ ఫామ్‌ను తయారు చేశారు. అందులో ఫ్యాసన్‌ ఫుడ్‌, బార్‌బరస్‌ (చెర్రి), మామిడి, సూది నిమ్మకాయ, అంజీరా, కరివేపాకు, బత్తాయి, నారింజ, లేమన్‌ గ్రాస్‌, లిపిస్టిక్‌, ఉల్లి, సోంపు, టమాట, మునగ, ముల్లంగి, బీట్‌రూట్‌, ద్రాక్ష, ఓమ, జామ, అరటి, మోసంబి, సంత్రా, కూరగాయలు సాగు చేస్తున్నాడు. ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తున్న ఆదర్శరైతు సిందే సాయినాథ్‌ పంటలు చూసేందుకు వివిధ జిల్లాల నుంచి వస్తున్న రైతులు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇంట్లో రెయిన్‌ వాటర్‌ హార్వెస్టింగ్‌

సాయినాథ్‌ ఇంట్లో రెయిన్‌ వాటర్‌ హార్వెస్టింగ్‌ ఏర్పాటు చేశాడు. ఇంటిముందు వాటర్‌ సంప్‌ ఏర్పాటు చేసి దానికి హైండ్‌పంప్‌ అమర్చాడు. అందులో వర్షాకాలంలో వర్షపునీటిని నిల్వచేసి ఏడాది మొత్తం ఆ నాటినే తాగుతున్నారు. వంటలకు, తాగడానికి మాత్రమే ఈ నీటిని ఉపయోగిస్తున్నట్లు రైతు తెలిపారు. మార్కెట్‌లో లభించే కెమికల్‌ వాటర్‌ తాగడంతో అనేక సమస్యలు వస్తున్నాయని, ప్రతిఒక్కరూ ఇంట్లో రెయిన్‌ వాటర్‌ హార్వెస్టింగ్‌ ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై

ముథోల్‌: మండలంలోని వడ్తాల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సంజీవ్‌కుమార్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దొడ్డుల గంగన్న, భోజవ్వ దంపతులు. భోజవ్వ అక్క కూతురు పెళ్లి కోసం ఈనెల 1న మండలంలోని ఆష్టా గ్రామానికి వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపల బీరువా తీసి చూడగా 4 తులాల బంగారం, 10 తులాల వెండితోపాటు రూ.15 వేలను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్క్రాప్‌చోరీ కేసులో ఒకరికి ఆరునెలల జైలు

మంచిర్యాలక్రైం: స్క్రాప్‌చోరీ కేసులో ఒకరికి ఆరునెలల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ మంచిర్యాల జూనియర్‌ సివిల్‌ జడ్జి, జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ నిరోష సోమవారం తీర్పునిచ్చింది. పట్టణ సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. 2024 ఆగస్టు 30న మంచిర్యాల ఏసీసీ కంపెనీలో ఒకరు స్క్రాప్‌ చోరీ చేసి తీసుకెళ్తున్నాడు. సెక్యూరిటీ గార్డు క్రీస్తుదాసు తన మిత్రుడు రాజ్‌కుమార్‌తో కలిసి పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయాడు. సెక్యూరిటీ గార్డు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై సనత్‌కుమార్‌ కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా రాజీవ్‌నగర్‌కు చెందిన గుమ్మడి సారయ్య నిందితుడని గుర్తించి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేసి హాజరుపర్చారు. పీపీ ఎస్‌.రవీందర్‌ సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేస్తూ మేజిస్ట్రేట్‌ తీర్పునిచ్చిందని సీఐ వెల్లడించారు.

ఉలికిపాటు!

- నిజామాబాద్‌లో ఏసీబీకి పట్టుబడ్డ ఎస్‌ఆర్‌వో శ్రీరామరాజు
- కొన్నినెలల క్రితం ఆదిలాబాద్‌ నుంచి అక్కడికి బదిలీ
- ఇక్కడ కూడా ఆది నుంచి వివాదాస్పదుడే
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశం


జిల్లా కేంద్రంలోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్‌: నిజామాబాద్‌లో సబ్‌ రిజిస్ట్రార్‌ శ్రీరామరాజు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం జిల్లా రిజిస్ట్రార్‌ శాఖలో కలకలం కలిగించింది. దీనికి కారణం లేకపోలేదు.. ఎన్నోఏళ్ల పాటు ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో విధులు నిర్వర్తించిన శ్రీరామరాజు కొన్ని నెలల క్రితం ఇక్కడి నుంచి బదిలీపై నిజామాబాద్‌కు వెళ్లారు. ఏసీబీ విచారణలో ఇక్కడి అవినీతి మూలాలేవైన బయట పడతాయా అనే ఆందోళన కూడా మొదలైంది.

శ్రీరామరాజు గతేడాది మధ్యలో జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడి నుంచి నిజామాబాద్‌ సబ్‌రిజిస్ట్రార్‌గా వెళ్లారు. ఆదిలాబాద్‌లో చివరిగా చిట్‌ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తూ ఈ ట్రాన్స్‌ఫర్‌లో అక్కడికి వెళ్లారు. దీనికంటే ముందు జిల్లా రిజిస్ట్రార్‌ కార్యాలయంలోని ఆడిట్‌ విభాగంలోనూ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. అంతకుముందు ఆదిలాబాద్‌ ఎస్‌ఆర్‌ఓ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్‌ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనపై శాఖపరంగా సస్పెన్షన్‌ వేటుపడింది. అంతకుముందు నిర్మల్‌ జిల్లా భైంసా సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తూ అనేక అనధికారిక లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ చేశాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరుగుతున్నప్పుడే ఆదిలాబాద్‌ ఎస్‌ఆర్‌ఓ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఇలా సస్పెన్షన్‌కు గురికావడం అప్పట్లో ఆదిలాబాద్‌లో కలకలం కలిగించింది. ఇదిలా ఉంటే బోథ్‌, ఖానాపూర్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లోనూ ఆయన విధులు నిర్వహించారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలోనే అధిక కాలం పనిచేశారు.

కలకలం..

సబ్‌ రిజిస్ట్రార్‌ శ్రీరామరాజు ఏసీబీకి పట్టుబడటం జిల్లా రిజిస్ట్రార్‌ కార్యాలయంలోనూ కలకలం కలిగించింది. జిల్లాలోనూ సబ్‌ రిజిస్ట్రార్లు పలు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అనధికారిక లేఅవుట్లలో ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా బడా రియల్టర్లతో కలిసి జిల్లాలో అసైన్డ్‌ భూముల్లో రిజిస్ట్రేషన్లు చేశారనే అపవాదు ఉంది.

ఆర్జీయూకేటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం


ఫ్యాకల్టీ, ల్యాబ్‌ సిబ్బందితో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్‌

బాసర: ఆర్జీయూకేటీలో ఈసీఈ డిపార్ట్‌మెంట్‌, చండీగఢ్‌లోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నికల్‌ టీచర్స్‌ ట్రైనింగ్‌ అండ్‌ రీసెర్చ్‌తో కలిసి ×ఉచిత సిమ్యులేటర్లను ఉపయోగించి, ల్యాబ్‌ సబ్జెక్టులు బోధించడం‌అనే అంశంపై సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం నిర్వహించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ గోవర్ధన్‌ మాట్లాడుతూ ఉచిత సాఫ్ట్‌వేర్‌ ప్రాముఖ్యత, ప్రయోజనాలను గురించి వివరించారు. ఐదు రోజుల వర్క్‌షాప్‌లో ఫ్యాకల్టీ సభ్యులు 25 మంది ల్యాబ్‌ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్‌ డాక్టర్‌ జీవీఎస్‌ ఎస్‌ కేఆర్‌ నాగాంజనేయులు, ఏవో శ్రీరణధీర్‌ సాగి, అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ కె.మహేశ్‌, ఈసీఈ విభాగం అధిపతి శ్రీ సాయి రాధాకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.